## క్లుప్తంగా

### కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



అయిజ: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప అన్నారు. సోమవారం మండలంలోని మేడికొండ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంత రావు, జయన్న, మౌలాలి, గ్రామ సంఘం లీడర్లు, రైతులు పాల్గొన్నారు.

### ఆదర్శనేత వాజ్‌పేయి

గద్వాలటౌన్: భారత మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప ఆదర్శ నేత అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు కొనియాడారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, బండల వెంకట్రాములు, అక్కల రమాదేవి, జయశ్రీ, నర్సింహా, దేవదాసు, కిష్టన్న, అనిల్, శ్యామ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఆంజనేయులును సన్మానించిన గట్టు తిమ్మప్ప

గట్టు: బల్గెర గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులును సోమవారం స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప ఘనంగా సన్మానించిన అభినందించారు. బల్గెరకు చెందిన బోయ ఆంజనేయులు గ్రూప్-2,3,4తో పాటు హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగాలకు అర్హత సాధించిన విషయం తెలిసిందే. దీంతో బల్గెరలో నిర్వహిస్తున్న శ్రీ దిగబంర స్వామి జాతర సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన గట్టు తిమ్మప్ప ఆంజనేయులు ఇంటికి వెళ్లి అభినందించారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చడానికి పిల్లలు ప్రయత్నించాలని కోరారు.

### చలివేంద్రం ప్రారంభం

ఇటిక్యాల: వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తహసీల్దార్ భద్రప్ప, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్‌లు అన్నారు. సోమవారం మండలంలోని మునగాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి గంగాధర్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

### బలమైన పోషకాహారం తీసుకోవాలి



ఎర్రవల్లి/మానవపాడు: గర్భిణులు, బాలింతలు ప్రతిరోజు బలమైన పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ సుజాత అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండలంలోని కొండేరులో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అమీర్‌పాష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్య, పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఉన్నారు.

- మానవపాడు మండలం చిన్నపోతులపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పోషణపక్షంలో భాగంగా చిన్నారులు, తల్లిదండ్రులతో మాట్లాడారు.

### 'వేడిచేసిన నీరు తాగండి'

మానవపాడు: తాగునీటి భద్రతపై నదిలోని నీటి మట్టం తగ్గిపోతుండటంతో (నీటి పంపు బావి)నుంచి మసకగా ఉన్న నీరు వస్తోందని, నేరుగా తాగితే సురక్షితం కాదని, నీటిని వేడి చేసి తాగాలని మిషన్ భగీరథ ఏఈ రాఘవేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిగించిన నీరు పాత్రలో నిలువ చేయాలన్నారు. నీటి ద్వారా వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలని ప్రజలకు సూచించారు.

### వీడని యువకుడి హత్య కేసు మిస్టరీ

కేటీదొడ్డి: ఈనెల 19న కేటీదొడ్డి గ్రామ శివారులో ఉపాధి పనుల్లో గుంతలు తవ్వుతుండగా ఓ యువకుడి మృతదేహం లభ్యమైన విషయం అందరికి తెలిసింది. పోలీసులు మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతదేహాన్ని మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన నర్సింహులు (32)గా గుర్తించారు. మొదట కుటుంబ సభ్యులు ఎవరు గుర్తించకపోవడంతో మృతదేహంపై ఉన్న పుట్టు మచ్చల ఆధారంగా మద్దెలబండ వాసిగా గుర్తించి ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడి హత్య కేసులో ఆధారాలు ఇంకా లభించడం లేదు. దీనిపై ఎస్ఐ శ్రీనివాసులను వివరణ కోరగా నిందితులను త్వరలో పట్టుకుంటామన్నారు. కుటుంబ సభ్యులను, అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నట్లు వారు తెలిపారు.

# సంతలో జాదుగాళ్లు..

- కొన ఊపిరితో ఉన్న పొట్టేళ్లను కోస్తున్న వైనం
- వ్యాధులతో ఉండే జీవాలకు ధర తక్కువ
- చనిపోయే ముందు సంతలోనే వధ
- సంతలోనే మాంసం అమ్ముతున్న వ్యాపారులు
- జిల్లాలోని సంతల్లో పాగా వేస్తున్న ఏపీ వ్యాపారులు



కొన ఊపిరితో ఉన్న పొట్టేలును వడ్డేపల్లి సంతలో అమ్మేందుకు తీసుకొస్తున్న అమ్మకందారులు

రాజోళి: 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న' చందంగా మారింది జిల్లాలోని మాంసం ప్రియుల పరిస్థితి. బర్డ్ ఫ్లూ భయంతో మటన్ తినాలనే కోరిక, పౌష్టికాహారం తీసుకోవాలని, వారానికోసారి మటన్ తీసుకునే వారు ఉన్నారు. దీన్ని ఆసరా చేసుకొని మాంసం వ్యాపారులు చేసే దందా చూస్తే షాక్ అవుతున్నారు. నాణ్యమైన మటన్ ఇస్తామని వ్యాధులున్న పొట్టేళ్లను, మేకలను కోసి మటన్‌గా అమ్ముతున్నారు. ప్రజలు కేజీ రూ.800లకు కొనుగోలు చేస్తున్నారు. మాంసం వ్యాపారం అనేది ఒక దందాలా మారింది. జాదుగాళ్లు సంతల్లో మాంసం దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ లేదు. సంతలో నిర్వాహకులకు తైబజారు వసూళ్లే తప్ప వీటిపై దృష్టి పెట్టడం లేదు. మాంసం, గొర్రెల వ్యాపారులు చేసే దందాతో ప్రజల ప్రాణాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి.

**సమీపంలో ఉన్న మందలపై దృష్టి..**

జిల్లాలో ఏ రోజున సంత జరుగుతుందో ఆ రోజు అక్కడికి సమీపంలో నిలుపుకున్న గొర్రెల మందపై కూడా కొందరు వ్యాపారులు దృష్టి పెడతారు. ఆ మందలో అనారోగ్యంగా ఉన్న వాటిని నామమాత్రపు ధరకు తీసుకుని దాని ప్రాణం పోకముందే సంతకు తీసుకొచ్చి లాభానికి అమ్ముకుంటారు. సంతలో కొన్న వారు మాంసం వ్యాపారులు కావడంతో వారు కేజీల చొప్పున అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. సాధారణంగా గొర్రెలను, పొట్టేళ్లకు ఆంత్రాక్స్ లాంటి ప్రాణాంతక వ్యాధులు రావడంతో పాటు, గ్రామాల్లో కుక్కలు కరవడం, ఎండలకు తీవ్ర అస్వస్థకు గురికావడం ఇతర కారణాల చేత మరణిస్తాయి. వాటి మాంసం తినేవారికి కూడా వ్యాధుల ప్రభావం ఉంటుంది. ఈ దందాలో కర్నూలు నుంచి వచ్చే వారితో పాటు, శాంతినగర్ అయిజ, రాజోళి, మటన్స్ వ్యాపారులు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొనుగోలు చేసిన జీవాలను వధశాలలోనే కోయాల్సి ఉండగా, సంతలోనే కోయడం, దాన్ని మధ్యాహ్నం వరకు ఆటోలో పడేసి ఆ తర్వాత ప్రజలకు అమ్మడం వంటి చర్యలతో ప్రజల ఆరోగ్యం గాల్లో కలిసిపోతుందని ప్రజలు అంటున్నారు. ఇలాంటి దందాలపై అధికారులు ఎవరూ ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం వల్ల దందా చేసే వారు మరింత రెచ్చిపోతున్నారు. ప్రతి సంతలో ఇలాంటి వాటిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

**కఠిన చర్యలు తప్పవు..**

సంతలో చనిపోతున్న పొట్టేళ్లను, మేకలను అమ్మేవారిపై. కొనేవారిపై దృష్టి పెడతాం. చనిపోయిన వాటి మాంసం అమ్మే వారిపై కఠిన చర్యలుంటాయి. సంతలో వీటిపై దృష్టి పెట్టే విధంగా స్థానికంగా ఉండే అధికారులకు ఆదేశాలిస్తాం. ప్రజల ప్రాణాలతో ఆడుకునే వారిపై కఠిన చర్యలు తప్పవు.

– నర్సింగరావ్,
స్థానిక సంస్థల అదనపు కలెక్టర్(ఇంచార్జ్)



సంతలోనే పొట్టేలును కోస్తున్న మాంసం వ్యాపారి

**కొన ఊపిరితో ఉన్న వాటిని కోసి..**

జిల్లాలో గొర్రెల సంతలు ఆయా మండల, మున్సిపాలిటీ కేంద్రాల్లో ఎక్కువగా జరుగుతాయి. వారానికి ఒకసారి జరిగే ఈ సంతలో గొర్రెలు, మేకలు, పొట్టేళ్లకు భలే గిరాకీ ఉంటుంది. ప్రత్యేకించి మాంసం వ్యాపారులు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తుంటారు. గద్వాలలో సోమవారం, అయిజలో గురువారం, వడ్డేపల్లిలో శుక్రవారం గొర్రెల సంత జరుగుతాయి. ఈ సంతల్లో లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. సంతకు ఇతర ప్రాంతాల నుంచి అమ్మకందారులు, కొనుగోలు దారులు వస్తుంటారు. జిల్లాలోని మాంసం వ్యాపారులతో పాటు ఏపీలోని కర్నూల్‌కు చెందిన వ్యాపారులు వస్తున్నారు. సంతలో ఆరోగ్యంగా ఉన్న జీవాలకు ఒక ధర నడస్తుండగా, మాంసం వ్యాపారులు సంత జరిగే చోటు నుంచి పరిసరాలకు వెళ్లి దారిలో కాపు కాస్తారు. రకరకాల వ్యాధులతో ఉన్నవి, మరికొద్ది సమయంలో చనిపోవడానికి సిద్ధంగా ఉన్న జీవాలను తీసుకొచ్చే వారిని కనిపెట్టి వారిని అక్కడే ఆపి బేరాలు సాగిస్తున్నారు. ఆరోగ్యంగా ఉంటే దాని ధర రూ.10 వేలపైగా పలుకుతున్నప్పటికీ, చనిపోయే వాటిని గమనించి ధర తక్కువ ధరకు బేరమాడి కొనుగోలు చేస్తున్నారు. అప్పటికే వ్యాధితో ఉన్న జీవాలు చచ్చుబడిపోయి, నేలమీద పడి దొర్లాడుతున్నా దాన్ని వదిలేసి, వారి పనిలో వారు ఉంటారు. మరికొద్ది క్షణాల్లో అది ప్రాణం వదులుతుందనుకున్న సమయంలో సంతలోనే దాన్ని కోసి, ఆటోలో పడేస్తారు. అనంతరం సంత ముగిశాక, స్థానికంగా ఉండే మటన్ వ్యాపారులకు దాన్ని కేజీల ప్రకారం అమ్మేస్తారు. మటన్ షాపు వారు నేరుగా ప్రజలకు అమ్ముతారు.

## క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరాలి



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కేటీదొడ్డి: విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పాతపాలెం కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్ గౌడు అన్నారు. మండలంలోని ఉమిత్యాలతండా పాఠశాలలో సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. గురుకులాల్లో సీట్లు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వినోద్, సీఆర్‌పీ పాపయ్య, కిరణ్, తదితరులు ఉన్నారు.

## గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అమరవాయిలో మిషన్ భగీరథ పైపులైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మల్దకల్: గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఎంపీఓ రాజశేఖర్‌లు పంచాయతీ సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని అమరవాయి గ్రామాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకైన ప్రదేశాన్ని వారు పరిశీలించారు. గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు వారి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఇళ్ల ముందు మురుగునీరు నిల్వకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖాజామీర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



పెంచికలపాడులో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించిస్తున్న పీఏసీఎస్ చైర్మన్



ధరూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామ సంఘం అధ్యక్షురాలు

గట్టు: ప్రభుత్వం గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ తెలిపారు. సోమవారం మాచర్ల, పెంచికలపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. గట్టు మాజీ సర్పంచు మోహన్‌గౌడు, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, కృష్ణ, రాజప్ప, రంగస్వామి, సురేష్, శ్రీనివాసరెడ్డి, ఆనంద్, మైబు, బీమేష్, హనుమంతురెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు ప్రారంభించారు. దళారులతో మోసాలకు గురి కావద్దని గ్రామ సంఘం అధ్యక్షురాలు సరోజమ్మ, కార్యదర్శి గోవిందమ్మ, కోశాధికారి పావనిలు సూచించారు. కార్యక్రమంలో వీఓఏలు రూతమ్మ, పద్మమ్మ, వీఓ 2 అధ్యక్షురాలు ఖాజాబీ, బుక్ కీపర్స్ సత్యన్న, వెంకటన్న, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## యూనిఫాంలు సిద్ధం చేయాలి

- ఎంఈఓ రవీంద్ర బాబు



విద్యార్థుల యూనిఫాం మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునః ప్రారంభ సమయానికి విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంలు సిద్ధం చేసి ఉంచాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ధరూరు, కేటీదొడ్డి మండలాల హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. యూనిఫాంకు సంబంధించిన మెటీరియల్ సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వాటిని హెచ్‌ఎంల సమక్షంలో ఎస్‌హెచ్‌జీలకు అందించారు. విద్యార్థుల మార్కుల న్నింటిని సద్ధం చేసి ఉంచాలని కోరారు. 23న విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కేటీదొడ్డి ఏపీఎం వెంకటేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం శోభారిణి, కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, వినయకుమార్, విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీకి వినతులు



సాక్షి,నెట్‌వర్క్: అలంపూర్‌లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు వచ్చిన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి పలువురు వినతులు అందజేశారు. 61 ఏళ్ల దాటిన వీఆర్‌ఏల వారసుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా శ్రవణ్‌కుమార్, సుకన్య, కేఎంఆర్, ఏసే, అద్దాకుల అయ్యన్నల ఆధ్వర్యంలో ఎంపీని శాలువాతో సత్కరించారు.

- ఉండవెల్లి మండల కేంద్రంలోని భూ భారతి అవగాహన సదస్సుకు వచ్చిన ఎంపీకి పుల్లూరు శివారులో 7వేల ఎకరాలు ఉన్నా ఆర్‌డీఎస్ లిఫ్ట్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వినతి అందచేశారు.
- ఎర్రవల్లి మండల కేంద్రంలో ఎంపీ మల్లు రవిని అలంపూర్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో ఎర్రవల్లి కూడలిలో ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నర్సింహారెడ్డి, నాగరాజు ఉన్నారు.

### ఎడ్ల బండ్ల గిరక పోటీలు



గట్టు: మండలంలోని బల్గెర గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ దిగంబరస్వామి జాతర సందర్భంగా సోమవారం ఎడ్ల బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను బీఆర్‌ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి బల్గెర హనుమంతునాయుడు ప్రారంభించారు. హనుమంతునాయుడు మాట్లాడుతూ రైతులు ఎంతో ఉత్సాహంగా పోటీలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నూర్‌పాష, కిష్టప్ప, రాముడునాయుడు, వెంకటేష్, కంగారు తిమ్మప్ప, బాసు గోపాల్, రాజు, తిమ్మప్ప, రాముడు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### అకాల వర్షంతో నెలకొరిగిన చెట్లు



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి చెట్లు, కల్లాలోని మిర్చి పంట, పొగాకు పంట నెలకొరిగి చెదురు బాదురు అయినవి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దపోతులపాడులో దాదాపు 85 ఏళ్ల క్రితం నాటివృక్షం నెలకొరిగింది. ఎన్నో తరాలుగా గ్రామస్తులు జ్ఞాపకాలను చెట్టు మిగిల్చి ఒరిగిందని వాపోయారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



అలంపూర్‌లో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న వరి రైతులు

అలంపూర్: రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ పట్టణంలో ఎమ్మెల్యే విజయుడికి వరి పంట సాగు చేసిన రైతులు సోమవారం వినతి పత్రం అందజేశారు. అలంపూర్ మండలంలోని సుల్తానాపురం, ర్యాలంపాడు, జిల్లెలపాడు గ్రామాలకు చెందిన రైతులు కేసీ కెనాల్ కింద శ్రీశైలం నీటి ముంపు పొలాల్లో వరి పంట సాగు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఐకేపీ ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కేసీ కెనాల్ ఆధారంగా నీటి ముంపు పొలాల్లో పండించిన ధాన్యాన్ని ఐకేపీ ద్వారా కొనుగోలు చేసే విధంగా చూడాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు ఉన్నారు.

**సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ అందజేత..**

కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. అలంపూర్ మండలంలోని క్యాతూర్ గ్రామానికి చెందిన కురువ నడిపి మల్లయ్య ఆపరేషన్ కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆపరేషన్ కోసం రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు కావడంతో ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.

**అకాల వర్షాలకు రైతులు ఆగమాగం**

మానవపాడు: అకాల వర్షానికి పంటలు తడిసి రైతులు ఆగమాగమవుతున్నారు. మిర్చి, పొగాకు పంటలు వర్షానికి తడిశాయి. మండల కేంద్రంలోని తడిసిన మిర్చి, పొగాకు పంటలను ఎమ్మెల్యే విజయుడు పరిశీలించారు. తడిసిన పంటలపై అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరమని ఎమ్మెల్యే తెలిపారు. నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు సేకరించి మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జిల్లాలోని పొగాకు పండించిన ప్రతి రైతుది కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, గొల్ల వెంకట్రాములు, చోటా, అందిరిచెట్టు పెద్దరాముడు, పరమేష్, నాయకులు పాల్గొన్నారు.

**శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం**

మానవపాడు: అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థలో ఉందని, సరి చేయాలని సోమవారం నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, గొల్ల వెంకట్రాములు ఎమ్మెల్యే విజేయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దార్ జోషి శ్రీనివాసశర్మ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నారని ఎమ్మెల్యే విజేయుడు సూచించారు. పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో వచ్చే సంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

ఇటిక్యాల: మండలంలోని ఉదండాపురం గ్రామానికి చెందిన గొల్ల వీరేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు.

## పునరావాస గృహాలను పట్టించుకోరా?



రాజోళిలోని పునరావాస గృహాల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు

రాజోళి: మండల కేంద్రంలోని పునరావాస గృహాల్లో నివసిస్తున్న వారి గురించి పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న గృహాలతో పాటు, ఇళ్ల మధ్యలో మొలిచిన పిచ్చి మొక్కలు, నిత్యం పందులు, పాముల సంచారంతో కాలం వెల్లదీస్తున్నట్లు పేర్కొన్నారు. నామమాత్రంగా నిర్మించిన ఇళ్లు ఎప్పుడు కూలుతాయో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. ఆదివారం వీచిన ఈదురు గాలులకు పునరావస గృహాల్లోని ఇంటి గోడ కూలిపోయింది. పునవాస గృహాల్లో నివసించే ప్రజలు భయపడుతున్నారు. త్వరగా ఇళ్ల మధ్యలో పిచ్చి మొక్కల తొలగింపుతో పాటు అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేయాలని కోరుతున్నారు.

## గాలికుంటు టీకాలతో వ్యాధులు దూరం



మాన్‌దొడ్డిలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

రాజోళి/శాంతినగర్: గాలికుంటు టీకాలతో పశువులకు వ్యాధులు దూరమవుతాయని పశు వైద్యాధికారి డాక్టర్ మల్లేష్ తెలిపారు. సోమవారం మండలంలోని మాన్‌దొడ్డి, తుమ్మలపల్లి గ్రామాల్లో 131 ఎద్దులకు, 170 గేదెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో కార్తీక్, శివ, లక్ష్మన్న, రాఘవేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

- వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు గ్రామంలో పశువులకు శాంతినగర్ పశువైద్యశాల సిబ్బంది గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామంలోని 25 మంది రైతులకు చెందిన 81 ఆవులు, ఎద్దులు, 189 గేదెలకు టీకాలు వేసినట్లు డాక్టర్ స్వరూపారాణి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది వరప్రసాద్, లతీఫ్ పాల్గొన్నారు.

### అభియాన్ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ధరూరు: జిల్లా స్థాయి ఆవిష్కార్ అభియాన్ క్విజ్ పోటీల్లో మండలంలోని మార్లబీడు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎలిమెంటరీ విభాగంలో ప్రథమ బహుమతి 6వ తరగతి విద్యార్థిని జి.హేమలత సాధించగా, సెకండరీ లెవెల్ ప్రథమ బహుమతి 9వ తరగతి విద్యార్థి మహబూబ్ పాష సాధించారు. వారితో పాటు గైడ్ టీచర్‌ను జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని అభినందించారు. ప్రశంసాపత్రాలతో పాటు మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ ఎస్తేర్ రాణి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### నీటి కనెక్షన్ ట్యాంపరింగ్‌పై ఎస్ఐకి ఫిర్యాదు

మానవపాడు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో(బోయగేరి) నీటి కనెక్షన్ ట్యాంపరింగ్‌పై సోమవారం ఎస్ఐ చంద్రకాంత్‌కు మిషన్‌భగీరథ ఏఈ రాఘవేంద్ర, వాటర్‌మ్యాన్ బీసన్న ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామాలలో మిషన్ భగీరథ నీటికి మోటారులు బిగించరాదని సూచించారు. మోటార్లు బిగిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎస్ఐ చంద్రకాంత్ ఈనెల 24న బీసీ కాలనీలో పరిశీలిస్తారని తెలిపారు. అమరవాయిలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు గ్రామంలో మిషన్‌భగీరథపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### కేసు నమోదు

గద్వాల క్రైం: ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బోయ వెంకటన్న గత నెల 20న పని నిమిత్తం బైక్‌పై గద్వాలకు వచ్చాడు. సాయంత్రం పట్టణంలోని వైఎస్సార్‌చౌక్ సమీపంలో పట్టణానికి చెందిన మురళి స్కూటీతో వెనక నుంచి వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటన్న ఎడమ కాలు విరిగిపోయింది. సోమవారం బాధితుడు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించాలి




అలంపూర్: ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీలను ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి. రమేష్ డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం కేవలం 7శాతం బడ్జెట్ కేటాయించిందన్నారు. తక్కువ బడ్జెట్‌తో విద్యా వ్యవస్థలు ఎలా బాగుపడతాయన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అశోక్‌కుమార్, జిల్లా నాయకులు గోపాల్, బీసన్న, కుమార్ నాయుడు, రాముడు, మాబుసాబ్ ఉన్నారు.

### ఎస్‌సీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామ్మోహన్



శాంతినగర్: రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎర్రమల్ల రామ్మోహన్‌ను ఎస్‌సీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు పస్పుల రామకృష్ణ సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీల అభివృద్ధి కోసం జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయించి బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆదివాసి మైనారిటీ ప్రజల సంక్షేమం కోసం, మహాజన సంక్షేమ రాజ్యం స్థాపన కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నరాములు ముదిరాజ్, ఎస్‌సీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమేష్, బీసీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామన్‌గౌడ్ పాల్గొన్నారు.